మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## లక్ష్యంతో చదివితే విద్యార్థులకు విజయం తథ్యం..

**-దేవరకద్రలో పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు: ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి**



హాజరైన విద్యార్థులు,ఉపాధ్యాయులు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి

**దేవరకద్ర,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** లక్ష్యంతో చదివితే విద్యార్థులకు తప్పక విజయం వరిస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. దేవరకద్రలో దేవరకద్ర, చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం ఇంపాక్ట్ సంస్థ చెందిన మోటివేటర్స్ తో ఒకరోజుమోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు పరిక్షల తేదీ సమీపిస్తున్నందున ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా చదువుకోవాలన్నారు. అప్పుడే పరిక్షల్లో బాగా రాయగల్గుతారన్నారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాదించిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు. బాగా చదివి తల్లితండ్రులకు, చదువుకొన్న పాఠశాలలకు పేరు ప్రతిష్టలు తెచ్చి పెట్టాలన్నారు. తల్లితండ్రులు మీపై పెట్టుకొన్న ఆశయాలను నెరవేర్చాలన్నారు. క్రమశిక్షణతో విధ్యనభ్యసించడానికి ప్రయత్ని ంచాలన్నారు. అలాగే విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎన్ఆర్ఐలు గోపినాథ్‌రెడ్డి, అమర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర, కౌకుంట్లమండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డిలతో పాటు ఆయా మండలాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో పాలమూరు పాలిటిక్స్..!

- బీజేపీలో చేరనున్న ఎంపీ రాములు..?
- తన కుమారుడు, జెడ్పీటీసీ భరతకు ఎంపీ టికెట్‌పై చర్చ
- నేడో రేపో పార్టీలో చేరే అవకాశం
- నాగర్‌కర్నూల్‌లో బీజేపీకి పెరగనున్న బలం
- మహబూబ్‌నగర్ టికెట్ ఆశిస్తున్న శాంతికుమార్
- అమిత్‌షా అపాయింట్మెంట్ కోసం ఢిల్లీకి..
- కొత్తమలుపులు తిరుగుతున్న రాజకీయం












**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ సిట్టింగ్ ఎంపీ రాములు సహా తన కుమారుడు, జెడ్పీటీసీ భరత్ బీజేపీలో చేరేందుకు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తున్నది. రానున్న పార్లమెంట్ నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ భరత్‌కు కేటాయించే విషయమై అధిష్టానాన్ని కోరగా, అధిష్టానం కూడా అందుకు ఓకే చెప్పినట్లు సమాచారం. ఎంపీ రాములు మొదటి నుంచి ఇటు పార్టీలో ప్రజల్లో మంచి పేరు ఉండడంతో నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో బీజేపీ బలం పెరగనున్నది. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ ఆశిస్తున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ ఢిల్లీ చేరుకున్నారు. ఇదే విషయమై అమిత్‌షా అపాయింట్‌మెంట్ కోరినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**బీజేపీలోకి సిట్టింగ్ ఎంపీ ?**

నాగర్‌కర్నూల్ సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములు బీజేపీలో చేరనున్నట్లు ఆయన సన్నిహితుల ద్వారా తెలుస్తుంది. అయితే ఇటీవల అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్లమెంటరీ సన్నాహక సమావేశాలకు రాములు ఆహ్వానం అందలేదు. అయితే గత కొంత కాలంగా రాములును పార్టీ దూరం పెడుతూ వస్తున్నదని, గతంలో అవకాశం ఉన్నా తన కుమారుడు భరత్‌కు జెడ్పీ చైర్మన్ ఇవ్వకపోవడం, అచ్చంపేట అసెంబ్లీ సీటు కోరినా నో చెప్పడంతో గౌరవం లేని చోట ఉండొద్దనే నిర్ణయంతో పార్టీ వీడేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే బీజేపీ నుంచి భరత్‌కు నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ ఇవ్వాలంటూ కోరగా అధిష్టానం కూడా అందుకు సిద్ధంగా ఉన్నట్లు పార్టీ విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో నేడో రేపో పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు.

**కందనూలులో పెరగనున్న బలం..**

నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో ఎంపీ రాములుతోపాటు జెడ్పీటీసీ భరత్ చేరికతో బీజేపీ బలం పెరగనున్నది. మొదటి నుంచి బీజేపీ అభ్యర్థులు పార్లమెంట్‌లో గెలిచిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతం అయినా 2019లో బీఆర్ఎస్ నుంచి ఎంపీగా రాములు గెలుపొంది రికార్డు సృష్టించారు. రెండు సార్లు శాసనసభ సభ్యుడిగా, ఒకసారి ఎంపీగా గెలుపొందిన రాములు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రాంత స్థానికుడు కావడం, చదువుకున్న వ్యక్తికావడం, అందరితో సత్సంబంధాలు కలిగి ఉండడం ఆయనకు కలిసివస్తున్నదని చెప్పవచ్చు. రాములు బీజేపీలో చేరడమే కాదు భరత్‌ను ఎంపీగా గెలిపించుకుంటామనే ధీమాతో బీజేపీ అధిష్టానాన్ని ఒప్పించినట్లు సమాచారం. ఏది ఏమైనా సిట్టింగ్ ఎమ్మెల్యే రాములు చేరికతో బీజేపీకి నాగర్‌కర్నూల్ జిల్లాలో బలం చేకూరుతుందనడంతో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**ఢిల్లీలో బండారి శాంతికుమార్**

బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఆశిస్తున్నట్లు పలు సందర్భాల్లో ఆయనే ప్రకటించారు. 2012లో పార్టీలో చేరిన ఆయన దశాబ్దానికి పైగా పార్టీకి సేవ చేయడమే కాకుండా వివిధ సందర్భాల్లో ఎంపీ టికెట్ కూడా అధిష్టానం నిర్ణయం మేరకు వదులుకున్నారు. అయితే ముఖ్యంగా బీసీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో బీసీ వర్గాలకు చెందిన నేతలు ఆయనకు మద్దతు తెలుపుతున్నారు. అయితే బీజేపీ నుంచి డీకే అరుణతోపాటు, జితేందర్‌రెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో శాంతికుమార్ రెండు రోజులుగా ఢిల్లీలో ఉన్నారు. అమిత్ షా అపాయింట్‌మెంట్ కోసం వేచి ఉన్నట్లు తెలిసింది. అయితే మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ తనకే ఇవ్వాలని, తనకు అన్ని వర్గాల మద్దతు ఉందని, ముఖ్యంగా బీసీ జనాభా ఎక్కువ ఉన్న పాలమూరులో తనకు టికెట్ కేటాయిస్తే తప్పక గెలుస్తామనే విషయాలను అమిత్ షాకు వివరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఏది ఏమైనా మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ విషయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది.




**కాసులే లక్ష్యంగా కొన్ని ప్రైవేట్‌లో ఆపరేషన్లు చేస్తున్న వైద్యులు**

**తగ్గిన సహజ కాన్పులు... పెరిగిన సిజిరియన్లు**

**సహజ కాన్పుల పెంచేలా వైద్యాధికారుల సమావేశాలు చర్యలు ఫలించేనా...**

**తల్లి గర్భం దాల్చడం బిడ్డకు జన్మనివ్వడం అనేది దేవుడు ఇచ్చిన వరం. సహజంగా కాన్పులు జరిగేవి పాతవి. నేడు గర్భం దాల్చినప్పటి నుండి రెస్ట్ తీసుకోవాలంటూ వైద్యుల సలహాలు సూచనలతో చాలా సహజకాన్పులు తగ్గిపోయి సిజిరియన్లు అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.**

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** జిల్లాలో కొన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో విచ్చలవిడిగా సిజిరియన్లు జరుగుతున్నాయన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. కాన్పు కోసం కొన్ని ప్రైవేట్ దవఖానలకు పోతే వైద్యులు కాసుల కక్కుర్తితో కడుపులను కోస్తున్నారని, ప్రభుత్వం సహజ కాన్పులను ప్రోత్సహించాలని ఆదేశాలను ఇచ్చినా బేఖాతర్ చేస్తున్నారు. అవసరం ఉన్నా లేకున్నా సర్జరీలు చేసి పేషెంట్లను నిలువునా దోచుకుంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా గల ప్రైవేటు ఆసుపత్రిలో దాదాపు 74 శాతం ఆపరేషన్లు జరుగుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఇంత శాతం జరుగుతున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు కంట్రోల్ చేయడం లేదని, పై నుండి ఆదేశాలు వస్తే కదలడం లేదని అది కూడా తూతూ మంత్రంగా తనిచలు చేసి తప్పుడు రిపోర్టులు పంపి చేతులను దులుపుకుంటున్నారని విమర్శలు బహిరంగగా వినిపిస్తున్నాయి.

**అమ్మ కడుపు కోతకు ప్రాధాన్యం....**

జిల్లాలో 50కు పైచిలుకు పెద్దఆసుపత్రులు ఉన్నాయి. ఎక్కువ సంఖ్యలో డెలివరీలు జరుగుతున్నాయి. గత సంవత్సరం ప్రభుత్వ,ప్రైవైట్ దవాఖానలో కలిపి మొత్తం 9572కాన్పులు జరిగాయి. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రిలో మొత్తం 6652 కాన్పులు కాగా 3874 సహజ కాన్పులు ( 69.4 శాతం ), 2778 సిజిరియన్లు ( 41.7 శాతం) ప్రైవేట్ ఆసుపత్రిలో మొత్తం 2920 కాన్పులు జంగగా అందులో సహజకాన్పులు 754 ( 25.8శాతం), సిజిరియన్లు 2166 ( 74.18 శాతం ) జరుగుతున్నాయంటే కొన్ని ప్రైవేట్ డాక్టర్ల తీరును అనుమానించాల్సి వస్తోంది . కొన్ని ప్రైవేట్‌లో ముహుర్త పు డెలివరీలు ఎక్కువగా జరుగుతున్నాయని సహజ కాన్పులు జరిగే అవకాశం ఉన్నప్పటికి కోంతమంది ప్రజలు మంచి రోజు చూసుకుని సిజిరియన్లు చేయించు కుంటున్నారన్న విమర్శలు సైతం ఉన్నాయి. ప్రభుత్వం ముహర్తపు డెలివరీలు చేయవద్దని ఆదేశాలిచ్చినా డాక్టర్లు లైట్ తీసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి.

| ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలో కాన్పుల వివరాలు .... | సహజ కాన్పులు | శాతం | సిజిరియన్లు | శాతం |
|---|---|---|---|---|
| ప్రభుత్వ ఆసుపత్రిలో | 3874 | 69.4 | 2778 | 41.7 |
| ప్రైవేట్ ఆసుపత్రిలో | 754 | 25.8 | 2166 | 74.18 |

**అమ్మ మాతృత్వం డాక్టర్లకు మారిన వరం**

ప్రతి అమ్మకు మాతృత్వం వరం లాంటిది అలాంటి కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లకు వరంలా మారింది. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో కూతురో, కోడళ్ల గర్భం దాల్చిందినంటే సంతోషం కంటే డెలివరీ ఖర్చుల భయమే వెంటాడుతుంది. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో నెలనెల చెకప్‌లకు రూ 2వేల నుండి రూ 3వేలు ఖర్చు అవుతున్నాయని, అవసరం లేకున్నా ప్రతి సారీ రక్త పరీక్షలు, స్కానింగ్, గోలిలు, టానిక్‌లు అంటూ అందినంత దోచుకుంటున్నారని విమర్శలు చాలానే ఉన్నాయి. గర్భిణీలు మంచం మీద నుంచి కదలొద్దని సలహాలిచ్చి సహజ కాన్పులు అయ్యే ఛాన్స్ ఉన్నా లేకుండా చేస్తున్నారు. ఇక సహజ కాన్పులు రూ 15 వేల నుండి రూ 25 వేలు, సిజిరియన్‌కు రూ 30వేలకు పైగా ప్యాకేజీలను వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో డెలివరీ అంటేనే పేద, మధ్య తరగతి ప్రజలు బెదురుకునే పరిస్థితికి వచ్చింది. కడుపుకోతల వల్ల స్త్రీలకు భవిష్యత్తులో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పైసల దందా ....**

జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో సహజ కాన్పు వెళ్తే ఇక కడుపు కోతలు తథ్యమనే అనేలా ఉంది. ఎడపెడా శస్త్ర చికిత్సలు చేసేసి బిల్లుల రూపంలో వేలు దండుకోవడం పనిగా మారింది. ఇందుకోసం చైన్ సిస్టమ్‌ను కొన్ని ప్రైవేట్ దవాఖానాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఇందులో గ్రామాల్లో పని చేసి కొంతమంది ఆర్ఎంపీ, పిఎంపీలను మధ్యవర్తులుగా పెట్టుకుంటున్నారు. అంగన్‌వాడి, ఆశ కార్యకర్తల సలహాలు, సూచనలతో 9 నెలల వరకు పౌష్టికాహారం అందుకుంటున్న వారు అకస్మాత్తుగా నొప్పులు రాగానే హడావిడిగా కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ప్రజల భయాలను, ఆందోళనలను గుర్తిస్తున్న కొంతమంది ఆర్ఎంపీలు చేతినిండా డబ్బులు సంపాదిస్తున్నారు. అప్పటికే ఆయా దవాఖానాలతో ఒప్పందాలు చేసుకోవడంతో పిఆర్వోల ద్వారా ఆపరేషన్లకు రికమిండ్ చేసి కమిషన్ పొందుతున్నారు. ఈ రూపంలో పైసల దందా ఇష్టారీతిన జరుగుతుండడంతో సామాన్యులకు కొన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో తలకు మించిన భారం పడుతున్నది. ఒక్కో కాన్పుకు రూ 30 వేల పై చిలుకు ఖర్చు - మిగతా4లో..

## ఉపాధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి :జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్



జిల్లా పరిషత్ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :** ఉపాధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఉపాధి హామీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ ధన్వాడ మండల కేంద్రంలోని నూతన తహసిల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించి మైనర్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కిస్టాపూర్ నర్సరీని కలెక్టర్ తనిఖీ చేశారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించి వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో మొక్కలు ఎండి పోకుండా తగు జాగ్రత్తలు తీసుకుని ప్రతిరోజు నీరు పట్టించా లన్నారు. వానాకాలం ప్రారంభం నాటికి మొక్కలు నాటే విధం గా ప్రణాళిక ప్రకారం నర్సరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ పనులలో భాగంగా గ్రామ సమీపంలోని ఏర్పాటు చేసిన కందకాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తూ వేసవిలో కూలీలకు ఉపాధి కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో 150 మంది కూలీలకు పని కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ మండలం లోని గోటూరు, కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారమే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. వచ్చేనెలలో జరిగే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అవసరమైతే ప్రత్యేక తరగతు లు నిర్వహించి వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయా లన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ సింధుజ, ఎంపిడిఓ సాయిప్రసాద్, ఉపాధి అధికారులు పాల్గొన్నారు. అలాగే మంగ ళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ దామరగిద్ద తహసిల్దార్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్షించి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలి..

**అసెంబ్లీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి**

**ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు వర్తిస్తాయి**

**ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**

**సంబంధిత అధికారులతో కలెక్టర్ వెబెక్స్ సమావేశం**




సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** ఫిబ్రవరి 26న ఎన్నికల కమిషన్ ద్వారా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణకు ప్రకటన జారీ చేయడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) తక్షణం అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. వనపర్తి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు మంగళవారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాల్ నుండి జిల్లా ఎస్పీ, జిల్లా పోలీస్ అధికారులు, జిల్లా అధికారులు, మండల స్థాయి జిల్లా పోలీస్ అధికారులతో కలెక్టర్ వెబెక్స్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ని పకడ్బందీగా అమలు చేయాలని 24/48/72 గంటల్లో తీసుకోవాల్సిన చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక అధికారి ఎలాంటి పక్షపాతం లేకుండా, పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను సమర్ధంగా అమలు చేయడం అధికారుల బాధ్యత అని, ఎన్నికల కమిషన్ విడుదల చేసిన మార్గదర్శకాలను చదివి వాటిని తూ.చ తప్పకుండా అమలు చేయాలన్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన తొలి 24 గంటల్లో ప్రతి ప్రభుత్వ కార్యాలయం లోపల, బయట ఎలాంటి రాజకీయ సంబంధిత పోస్టర్లు, చిత్రాలు, ప్లెక్సీలు, హోర్డింగులు, క్యాలెండర్లు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విషయంలో నోడల్ అధికారిగా ఆర్డీవో బాధ్యత వహించాలని చెప్పారు. కోడ్ అమల్లో ఉన్నప్పుడు స్థానిక సంస్థలకు సంబంధించి ఏవైనా సమావేశాలు నిర్వహించాలనుకుంటే తప్పనిసరిగా జిల్లా ఎన్నికల అధికారి నుంచి రాతపూర్వకంగా అనుమతితీసుకోవాలని చెప్పారు. రాజకీయ సంబంధిత పనులకు వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు, రాజకీయ నాయకులను కలవడం కానీ, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం కానీ చేయవద్దు అన్నారు. ఎన్నికల క్యాంపెయిన్, రాజకీయ సమావేశాలను ఎస్ఎస్‌టి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ద్వారా వీడియో తీయించాలని సూచించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిం చేందుకు అధికారులు అందరూ బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ను ఎవరైనా ఉల్లంఘిస్తే ఆర్.పి.యాక్ట్ 129ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుఉంటే జిల్లాఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఏవిధమైన ఎన్నికల కోడ్‌ను అమలు చేయడం జరిగిందో అదే మాదిరి ఎన్నికల నియమావళి ఎమ్మెల్సీ ఎన్నికలకు అమలుచేయాలని ఆదేశించారు. ఈ వెబెక్స్ సమావేశంలో జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి, పోలీసు అధికారులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వంశీచంద్‌రెడ్డి.. దూకుడు..



- సమస్యలు తెలుకుంటూ.. ప్రణాళికలు వివరిస్తూ..
- పాలమూరు న్యాయయాత్రతో ప్రజల్లోకి..
- మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా సీఎం గ్రీన్ సిగ్నల్‌తో ఫుల్ జోష్
- ఇప్పటికే సీపీఐ మద్దతు కోరిన 'చల్లా'
- వివిధ కుల,మత,ఉపాధ్యాయ,వర్గ, యువజన సంఘాలతో సమావేశాలు
- పాలమూరులో గెలుపునకు సమిష్టిగా కృషి
- 7అసెంబ్లీ స్థానాల్లోనూ కాంగ్రెస్ క్లీన్‌స్వీప్
- వంశీ గెలుపులో ఎమ్మెల్యేల 'కీ'రోల్
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, చల్లా వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ బరిలో నిలుస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి మొన్న కోస్గి సభలో ప్రకటించడంతో వంశీ దూకుడు పెంచారు. ఒకడుగు ముందుకేసి కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి వంశీచంద్‌కు 50 వేల మెజార్టీ ఇవ్వాలని కోరడం కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపింది. మిగతా ప్రధాన పార్టీలు అభ్యర్థలను కూడా ప్రకటించకపోగా ఇప్పటికే చల్లా వంశీచంద్‌రెడ్డి పాలమూరు న్యాయయాత్ర పేరుతో పార్లమెంట్ సెగ్మెంట్‌లో పర్యటిస్తూ ప్రజలను కలుస్తూ, ఆప్యాయంగా పలుకరిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ ముందుకుసాగుతున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని 7అసెంబ్లీ సెగ్మెంట్లలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయదుందుభీ మోగించడంతో వంశీచంద్‌రెడ్డి గెలుపులో ఎమ్మెల్యేలు కీలకంగా మారనున్నారు. అందరి మద్దతుతో పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

**నిత్యం ప్రజల్లోనే ఉంటూ..**

ఎన్నికలతో సంబంధం లేకుండా అధికారంలో ఉన్నా లేకున్నా ఎల్లప్పుడూ ప్రజలో ఉండడం వంశీచంద్‌రెడ్డి ప్రత్యేకత. విద్యార్థి దశ నుంచే ఆయనకు రాజకీయాలపై ఆసక్తి ఉన్నది. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2014లో రాష్ట్రంలో అంతా తెలంగాణ వాదంతో గెలుపొందుతుండగా కల్వకుర్తి అసెంబ్లీ స్థానం వంశీ గెలుపొందారు. ఆయన సేవలను గుర్తించిన కాంగ్రెస్ అధిష్టానం 2018లో ఏఐసీసీ కార్యదర్శిగా నియమించింది. 2018లో కల్వకుర్తి నుంచే తిరిగి పోటీ చేసి జైపాల్‌యాదవ్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2019లో పోటీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి పోటీ చేసి సుమారు 20శాతం ఓట్లు సాధించారు. 2023 ఆగస్టు 20న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమితుడయ్యాడు. పాలమూరు పాదయాత్రతో ప్రజలకు మరింత చేరవయ్యారు. ఇప్పటికే అయిదు నియోజకవర్గాల్లో పాదయాత్ర పూర్తి చేశారు. అన్ని వర్గాల ప్రజలను అడుగడుగునా ఆప్యాయంగా పలుకరిస్తూ యువకులు, రైతులు, మహిళలు ఇలా అందరి సమస్యలు తెలుసుకుంటూ యాత్ర కొనసాగించారు. ఇప్పటికే సీపీఐ నేతలతో కలిసి మద్దతు కోరారు. హైదరాబాద్‌లో సీపీఐకార్యదర్శి ఎమ్మెల్యే కేఎన్‌సాంబ శివరావు, సీపీఐ కార్యవర్గసభ్యుడు పల్లావెంకట్‌రెడ్డితో సమావేశమయ్యారు. అలాగే మహబూబ్‌నగర్‌లో పలుసంఘాలను కలుస్తూ మద్దతును మూటగడుతున్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రతి పిలుపును దగ్గరుండి ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రజల్లో వ్యతిరేఖతను సరైనసమయంలో సరైనవిధంగా మలుస్తూ ఉమ్మడిపాలమూరులో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతో కీలక పాత్ర పోషించారు.

**పార్లమెంట్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ హవా..**

మహబూబ్‌నగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ హవా కొనసాగుతున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలు షాద్‌నగర్, జడ్చర్ల, - మిగతా4లో..

## ఉప ఎన్నికకు మోగిన నగారా..!

**- మార్చి28న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉపఎన్నిక**

**- వచ్చే నెల 4న నోటిఫికేషన్, 11వరకు నామినేషన్లు**

**- వివరాలు వెల్లడించిన మహబూబ్‌నగర్ కలెక్టర్ జి రవినాయక్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :**మహబూబ్‌నగర్ స్థానికసంస్థల నియోజకవర్గ శాసన మండలి స్థానానికి మార్చి 28న ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్రం ఎన్నికల సంఘం షెడ్యుల్ విడుదల చేసినట్లు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి రవినాయక్ తెలిపారు. ఉప ఎన్నికలకు సంబంధించి మార్చి4న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యుల్‌తో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి పరిధిలోకి మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికల కోడ్ తక్షణమే అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యుల్ ప్రకారం మార్చి 4న నోటిఫికేషన్, 11వరకు నామినేషన్ల స్వీకరణ, 12న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు 14వరక గడవు ఉండనున్నది. మార్చి 28న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు, ఏప్రిల్ 4తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు.

## లక్ష్మీపల్లిలో ఘనంగా విద్యార్థుల స్వపరిపాలన దినోత్సవం

**దేవరకద్ర,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించిన తీరు అందరిని ఎంతగానో ఆకట్టుకొంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌గా అభిషేక్,డీఈఓగా సహస్ర, సియంఓగా రోహిత్,యంఓగా అశ్విని కేమార్, యంఓగా అవంతిక,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాడిగా బాలకృష్ణచారి,ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారిగా ప్రశాంతి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా చిన్నారిలతో పాటు దాదాపు 22మంది ఉపాధ్యా యులుగా వ్యవహరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన విద్యాబోధన లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్,బాసిద్,కల్పన,విద్యావాలంటీర్ వెంకట్‌రాములు,గ్రామస్థులు చెన్నయ్య,నరసింహ్ములులతో పాటు ఆయా తరగతుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి..

**కల్వకుర్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:**విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా యువజన అధికారి కోటానాయక్ అన్నారు. మంగళవారం కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద సేవా బృందం, నెహ్రు యువ కేంద్రాల ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లాక్ స్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను జిల్లా యువజన అధికారి కోటానాయక్, స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షులు శివకుమార్‌లు ముఖ్య అతిథులుగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం కోసం క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని, క్రీడల వల్ల భవిష్యత్తులో జాతీయ స్థాయిలో పేరు సాధించవచ్చునన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సేవా బృందం ఎప్పటికి అందుబాటులో ఉంటుందని, స్వామి వివేకానంద జీవిత చరిత్ర ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ అవసరమని సూచించారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు చెన్నకేశవులు, సేవా బృందం సభ్యులు చింటూ తదితరులు ఉన్నారు.



## నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు..

**- 7 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి... - పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఏ.సురేందర్‌రెడ్డి**

**కల్వకుర్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయని, పరీక్షలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఏ.సురేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 7 పరీక్ష కేంద్రాల్లో పకడ్బందిగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఒత్తిళ్లకు గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం 1568,ద్వితీయసంవత్సరం 1258మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చామన్నారు.పరీక్షకేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట పరీక్షల కస్టోడియన్ వేణు, సదానందంగౌడ్, మల్లేష్, రమాకాంత్, రాజేష్, భీమేశ్వర్, బాల్‌రాజు, శ్రీనివాస్, మహబూబ్‌అలీ, నయీమ్, జుబేర్ తదితరులు ఉన్నారు.



## పొదుపు చేయడాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి : డిఆర్డివో పిడి నర్సింగ్‌రావు

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** పొదుపు చేయడాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకో వాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పీడీ నర్సింగరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన 2 కె రన్ కార్యక్రమాన్ని కృష్ణవేణి చౌక్ వద్ద జెడా ఊపి ఆయన ప్రారంభించారు. కృష్ణవేణి చౌక్ నుంచి రాజీవ్ మార్గ్ వరకు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీకి కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేది వరకు ఆర్థిక అక్షరాస్యత వారాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం అయ్యపురెడ్డి, ఈడిఎస్ఈ కార్పోరేషన్ రమేశ్ బాబు, పశుసంవర్ధక శాఖ వెంకటేశ్వర్లు, డివైఎస్ఓ బిఎస్ ఆనంద్, వివిధ శాఖల అధికారులు, బ్యాంకు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎస్సి కులాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోండి

**ఎస్సి కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారిని సరోజ**

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** హైదరాబాదులోని రామంతాపూర్, బేగంపేట్ పబ్లిక్ పాఠశాలల్లో ప్రవేశాలకు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ జోగులాంబ గద్వాల్ జిల్లా ఇంచార్జి అధికారిని సరోజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024.25 విద్యా సంవత్సరానికి గాను ఒకటవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. చిన్నారులు 01.06.2017 నుంచి 31.05.2018 లోపు జన్మించి ఉండాలన్నారు. పుట్టిన తేది ధ్రువీకరణ పత్రాన్ని తహసీల్దార్, మున్సిపల్ కార్యఆలయం, మీసేవ ద్వారా పొంది ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణాల్లో అయితే రూ. రెండు లక్షల లోపు, గ్రామాల్లో అయితే రూ.లక్షా 50 వేల లోపు ఉండాలని సూచించారు. దరఖాస్తు ఫారానికి మీ సేవ ద్వారా పొందిన కుల, ఆదాయ , స్థానిక ధ్రువీకరణ పత్రాలతో పాటు, ఆధార్‌కార్డు రేషన్ కార్డు, జిరాక్స్‌లను జత చేయాలన్నారు. దరఖాస్తులను ఫిబ్రవరి 24 నుండి మార్చి 12వ తేది లోపు జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని ఐడిఓసి రూమ్ నెంబర్ ఎఫ్8 లో తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇతర వివరముల కొరకు 8309540738 నెంబర్‌ను సంప్రదించగలరు. లక్కీడీప్ ద్వారా తేది.15.03.2024 నాడు విద్యార్థుల ఎంపిక జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

## గుర్తు తెలియని అడవి జంతువు దాడిలో ఆవు దూడ మృతి

**వెల్దండ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:**గుర్తు తెలియని అడవి జంతువు దాడిలో ఆవు దూడ మృతి చెందిన సంఘటన వెల్దండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...మండల కేంద్రానికి చెందిన గంటల లక్ష్మయ్య అనే పాడి రైతు సోమవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద దూడను కట్టేసి ఇంటికి వచ్చారు. తిరిగి మంగళవారం ఉదయం వెళ్లి చూసే సరికి ఆవు దూడ మృత్యువాత పడి ఉంది. దూడపై గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేసి చంపినట్లు తెలిపారు. ఈ సంఘటనపై ఫారెస్ట్ అధికారులకు సమాచారమివ్వడంతో బీట్ అధికారి లలిత పరిశీలించారు. మృతిచెందిన ఆవు దూడ విలువ రూ.20వేల వరకు ఉంటుందని రైతు బోరున విలపించారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతు కోరారు. పశువైద్యాధికారి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో పంచానామ నిర్వహించారు.



## వనపర్తి డిసిఆర్బి డిఎస్పీగా కృష్ణ కిషోర్

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :** రాష్ట్రంలో సాధారణ బదిలీలలో భాగంగా అచ్చంపేట డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై వనపర్తి జిల్లా డిసిఆర్బి డిఎస్పీ కృష్ణ కిషోర్ వనపర్తికి డిసిఆర్బి డిఎస్పీగా రావడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి,కి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి కలిశారు.వనపర్తి డిసిఆర్బి డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎటువంటి పెండెన్సీ లేకుండా చూడాలని,త్వరితగదగా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసులను పూర్తి చేయాలని సూచించారు.



# మన్యంకొండలో ఘనంగా వెంకటేశ్వరస్వామి దర్బారుసేవ..!

- ముత్యాభరణ అలంకరణలో స్వామివారి దర్శనం
- ముగిసిన బ్రహ్మోత్సవాల సేవలు
- కొనసాగనున్న జాతర
- దాసంగాలతో స్వామివారికి భక్తులనైవేధ్యాలు

**దేవరకద్ర,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దర్బారుసేవ పూజా కార్యక్రమాన్ని సోమవారం రాత్రి అ ంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్రఘట్టాన్ని తిలకించడానికి భక్తులు మన్యంకొండకు అధికసంఖ్యలో తరలివచ్చారు. రథోత్సవం జరిగిన రెండవరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో బాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని కన్నులపండువలా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. అయితే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు స్వామివారిని శేషవాహనంపై ఉంచి ఈ సేవ నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ కూడ వివిద పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య, పాలక మండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.దీంతో బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే స్వామివారి వివిధ సేవలు ముగిసాయి. అయితే జాతర మాత్రం ఇంకా నెల రోజులపాటు కొనసాగుతుంది. ఈ నెల రోజులు శని,సోమవారాలలో భక్తులు మన్యం కొండ అధికసంఖ్యలో తకలివస్తారు. మన్యంకొండ స్వామివారి బ్రహ్మోత్సవాలు 19న అంగరంగా వైభవంగా ప్రారంభమైన విషయం విధితమే.



మన్యంకొండలో దర్బారుసేవ నిర్వహిస్తున్న పురోహితులు (ఇన్‌సెట్లో )శేషవాహనంపై అలంకరణలో స్వామి వారు



స్వామివారి సేవలో దైవగీతాలు అలపిస్తున్న పురోహితులు,భక్తులు

**ముత్యాభరణ అలంకరణలో స్వామివారి దర్శనం**

మన్యంకొండలో దర్బారుసేవ సందర్భంగా స్వామి వారు శేషవాహనం పై ఊరేగుతూ ముత్యాభరణ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలు,ముత్యాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అయితే ఉత్సవాల సందర్భంగా దేవస్థానానికి భక్తులు మన్యంకొండకు అధికసంఖ్యలో తరలిరావడం కొనసాగుతూనే ఉంది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలను భక్తులు సమర్పించి స్వామివారిని దర్శించుకొన్నారు. మరికొంతమంది తలనీలాలు సమర్పించారు.



మన్యంకొండలో అళహరి రామయ్యకు పూజలు చేస్తున్న అళహరి వంశీయులు

**అళహరి రామయ్యకు ప్రత్యేక పూజలు..**

మన్యంకొండ బ్రహ్మోత్సవాల సేవలు ముగింపు సందర్భంగా దేవస్థానం ఏర్పాటుకు ప్రధానకారకుడైన అళహరి వంశానికి చెందిన అళహరి రామయ్యకు దేవస్థానంలోని హనుమాద్దసుల మండపంలో ఈ పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది సేవలు ముగింపు రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అళహరి రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఈ పూజలు నిర్వహించారు. అలాగే దేవస్థానంలో వసంతోత్సవం పూజా కార్యక్రమాన్ని కూడ ఘనంగా నిరహించారు. ఈ కార్యకమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరిరామకృష్ణ,ఈఓశ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ...

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి,ఫిబ్రవరి27 ప్రభాతవార్త:**ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం జిల్లా కేంద్రంలో ర్యాలీని లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గైడ్లెన్స్ ప్రకారం జిల్లాలోని వివిధ బ్యాంక్ అధికారులు నాగర్‌కర్నూల్ జెడ్పీ గ్రౌండ్‌లో అవగాహన ర్యాలీని ప్రారంభించి బస్టాండ్ మీదుగా నల్లవెల్లి రోడ్డు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం మీదుగా జెడ్పీ గ్రౌండ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారి ఎల్డీఎం కౌశల్ కుమార్ పాండే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతను అలవర్చుకోవాలని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచన ప్రకారం ప్రతి సంవత్సరం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.వివిధ పాఠశాలలు, కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి బ్యాంక్ ఖాతాలను చదివే ప్రతి విద్యార్థి బ్యాంక్ ఖాతాలను తెరిచి అందులో వారు పొదుపును చేసుకొని భవిష్యత్తులో వాళ్ల అవసరాలకు ఉపయోగపడే విధంగా ఆర్థిక అక్షరాస్యత పాటించాలని కోరారు. పొదుపు చేయడం విద్యార్థి దశ నుంచే అలవాటు కావాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని తమ యొక్క ఖాతాల వివరాలను గాని ఓటీపీలను గాని ఎవరితోను పంచుకోవద్దని, పబ్లిక్ ప్రదేశాల్లోని పబ్లిక్ బ్యాటరీ చార్జెస్ ఉపయోగించరాదని తద్వారా తమ యొక్క వ్యక్తిగత వివరాలు సైబర్ నేరస్తులకు అందుతాయని, ఇలాంటి విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారి జి.వి రమేష్, ఏపీజీవీబీ ఆర్ఎం. రంజిత్, ఎస్బీఐ ఎడీఎం ఎం వివి సత్యనారాయణ, ఎస్బీఐ మేనేజర్ రాజేష్ బేరి, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, మీడియా ప్రతినిధులు ఉన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## డీఎస్పీ వెంకటేశ్వర్లకు ఘన సన్మానం..



**కల్వకుర్తి,ఫిబ్రవరి27 ప్రభాతవార్త:**కల్వకుర్తి డీఎస్పీగా వెంకటేశ్వర్లు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ సదానందంగౌడ్ ఆధ్వర్యంలో డీఎస్పీ వెంకటేశ్వర్లను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్న దృష్ట్యా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును నిర్వహించాలని డీఎస్పీని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అలీ, రాజేష్, శ్రీనివాస్, లక్ష్మికాంత్, సాగర్ తదితరులు ఉన్నారు.

## చేతి వృత్తుల వారు ప్రధాని విశ్వకర్మ యోజన పథకం వాడుకోవాలి..

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారందరూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గద్వాల్ జిల్లా కేంద్రంలోని అక్షయ గ్రాండ్ హోటల్ నందు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం అవగాహన సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సంప్రదాయ కుల వృత్తులను లాభదాయకంగా మార్చడం, కుల వృత్తి, చేతి వృత్తి దారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. 18 కేటగిరీలలో పనిచేస్తున్న చేతి వృత్తులపై ఆధారపడి జీవించే వారికి ఈ పథకంలో ఆర్థిక సాయం అందిస్తారన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన వారిని ఎంపిక చేసి నైపుణ్యం మెరుగుదల కోసం 5 రోజుల పాటు నైపుణ్యంలో అడ్వాన్సు శిక్షణ అందించడం జరుగుతుందని శిక్షణ కాలంలో రోజుకు 500 రూపాయల చొప్పున స్టైఫండ్ చెల్లిస్తారని విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు జారీ చేయబడుతుందన్నారు. లబ్దిదారులు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, రేషన్ కార్డు వంటి ధ్రువీకరణ పత్రాలతో డాక్యుమెంట్లు, ఆధార్‌తో లింకు అయిన మొబైల్ ఫోన్ నెంబర్ జత చేసి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. పీఎం విశ్వకర్మ యోజన కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని విశ్వకర్మలు తయారు చేసే వస్తువులకు సరైన మార్కెటింగ్ వసతి లభించేలా ఎంఎస్ఎంఈ కృషి చేస్తుందని అన్నారు. ఇలా అనేక ప్రయోజనాలతో కూడుకుని ఉన్న పీఎం విశ్వకర్మ పథకం గురించి గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, అర్హులైన, ప్రతి ఒక్కరు ప్రయోజనం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి యాదగిరి, ఎంఎస్ఎంఈ సహయ సంచాలకులు, బి.శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్, డిఆర్‌డిఓ పిడి నరసింగరావు, డిఎల్‌పిఓ వెంకట్‌రెడ్డి, ఎల్డీఎం అయ్యపు రెడ్డి, పీఎం విశ్వకర్మ యోజన జిల్లా కోఆర్డినేటర్ శేఖర్, సంబంధిత 18 రకాల చేతి వృత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



కార్యక్రమంలో పాల్గొన్న చేతి వృత్తిదారులు

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం




**కల్వకుర్తిరూరల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు.స్వపరిపాలన దినోత్సవంద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ,ఉపాధ్యాయ వృత్తి,ఉపన్యాససామర్థ్యం పెరుగు తుందన్నారు.విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన తీరుపై తమ అనుభవాలను పంచుకున్నారు.చక్కటి ప్రతిభ కన బరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వినతి, అంగన్‌వాడీ కార్యకర్త వసంత ఉన్నారు.

## కళాశాలకు ఇన్వెటర్ వితరణ..



**కల్వకుర్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20వేలు విలువ చేసే ఇన్వెటర్‌ను ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రిన్సిపాల్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడవద్దని కళాశాలకు ఇన్వెటర్ బహుకరించినట్లు తెలిపారు. ఇన్వెటర్ వల్ల విద్యుత్ సమస్య లేకుండా నిరంతరం పనులు చేసుకోవచ్చునన్నారు. కళాశాలకు ఇన్వెటర్ బహుకరించిన మిత్ర ఫౌండేషన్ సభ్యులకు కళాశాల అధ్యాపక తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

# బాలల సంరక్షణ శాఖ, చైల్డ్ లైన్ 1098 ఆధ్వర్యంలో అవగాహన

**వనపర్తి టౌన్ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ హై స్కూల్ నందు జిల్లా బాలల సంరక్షణ శాఖ, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం, ముఖ్య అతిథిగా లక్ష్మీబాయి జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అమ్మాయి 21 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అబ్బాయి వివాహన్ని బాల్యవివాహంగా చెప్పవచ్చు బాల్య వివాహం చేసిన వారిపై ప్రోత్సాహించిన వారిపై చట్ట ప్రకారం శిక్షర్హులు అవుతారు. చిన్నతనంలో పెండ్లి అయిన ఆడపిల్ల చదువు మానేసి ఎలాంటి సంపదన లేకుండా అత్తవారింట్లో నడుచుకునే విధానం తెలియక బాల్య వివాహం కారణం చేత చిన్న వయసులో గర్భం దాల్చి తల్లి కావడం తద్వారా ఎదురయ్యే అనేక సమస్యలకు చిన్నతనంలో వివాహం చేయడం కారణం అవుతుంది. కావున ప్రతి ఒక్కరు బాల్యవివాహాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు. అదే విధంగా బాల్యంలో ఎదురయ్యే సమస్యలకు చైల్డ్ హెల్ప్ లైన్ మీకు సహాయం చేస్తుందని అవసరమైన ప్రతి ఒక్కరు 1098 ఉచిత ఫోన్ నెంబర్‌కు సమాచారం తెలిపి సహాయం పొందాలని తెలిపారు. ఆడపిల్లలకు ఇబ్బందులు చేసే వారి పట్ల చట్టాలు కఠినంగా ఉన్నాయని అందుకు కారణం అయిన వారికి కఠిన శిక్షలు అమలు అవుతాయని అలాంటి వారిని కఠిన శిక్షలు అమలు అవుతాయని అలాంటి వారిని సమాజం కూడా అసహ్యించుకుంటుందని చెప్పారు. కిషోర బాలికలు పౌష్టిక ఆహారం తీసుకోవాలని అందుకు అంగన్‌వాడి సెంటర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆడపిల్లల అక్రమ రవాణ పట్ల జాగ్రత్తలు అవసరం తెలియని వారితో సన్నిహితం మంచిది కాదని తెలిపారు. తల్లిదండ్రులకు చదువుకునే పాఠశాలకు ఇబ్బంది కలిగించే పనులు చేయకుండా ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకుని ఆ దిశగా అడుగులు వేయాలని విద్యార్థులకు ఉద్దేశించి మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంబాబు, డిసిపిఓ రాజేశ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ రవి రాజ్, బాలరాజు, చైల్డ్ హెల్ప్ లైన్కేస్ వర్కర్స్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మదర్స్ ల్యాప్ హై స్కూల్‌లో పిల్లలకు అవగాహన ఇస్తున్న జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీబాయి

## కాంగ్రెస్ ప్రభుత్వం పేదల బడుగు బలహీన వర్గాల ప్రభుత్వం

**వనపర్తి టౌన్ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో గృహజ్యోతి పథ కం బడుగు బలహీన వర్గాల పేదింటి మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉచిత 200 యూనిట్ల కరెంటు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ గృహజ్యోతి పథకాలు శ్రీకారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, పేద ప్రజలకు అందించాలని ఆకాంక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరుచున్నారు. అలాగే మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్ర మహిళల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎస్.కె.ఖైరున్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు మాట్లాడారు.



## ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లు పూర్తి..

**వెల్దండ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:**నేటి నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో పరీక్ష రాయనున్న విద్యార్థుల నెంబరింగ్‌ను పూర్తి చేశారు. వెల్దండ మండలంలో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఓ లింగయ్య, మాడల్ పాఠశాలలో డీఓ పరుశరాములు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 162, ద్వితీయ సంవత్సరం 154, మాడల్ పాఠశాలలో మొదటి సంవత్సరం 222, ద్వితీయ సంవత్సరం 189 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఒక్క నిముషం ఆలస్యమైన పరీక్ష కేంద్రాలకు అనుమతించబడదన్నారు. కార్యక్రమంలో ఇన్విజిలేటర్స్ ఉన్నారు.



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న డీఓ

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**అడ్డాకుల,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఉపాధ్యాయులుగా 83 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలుగా మౌనిక, జిల్లా కలెక్టర్‌గా వెన్నెల, డిప్యూటీ కలెక్టర్‌గా శ్రీవల్లి, జడ్పీ ఛైర్‌పర్సన్‌గా కళ్యాణి, అర్‌జెడిగా భానుప్రసాద్, డీఈఓగా ఛత్రపతి, ఫిజికల్ డైరెక్టర్‌గా రాధిక వ్యవహరించారు. స్వయం పరిపాలన దినోత్సవంలోప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## రేపటి రథ సారథులు విద్యార్థులే: ఎంఈఓ



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

**బిజినపల్లి,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** రేపటి రథ సారథులు విద్యార్థులేనని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు.ఖానాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా ఉపాధ్యాయబాధ్యతలను నిర్వహించగా విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా కె.సౌమ్య మండల విద్యాధికారిగా డి. సునిత, ప్రధానోపాధ్యాయులుగా ఎండి ముస్కాన్ బేగంబాధ్యతలునిర్వహించారు. కార్యక్రమంలో పాలెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులువెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణ, వెంకట నర్సమ్మ, సుగుణ కుమారి,సుమతి, భాగ్యలక్ష్మి,అరుణకుమారి,శాంత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా కార్యదర్శిగా రాధమ్మ నియామకం



కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలుగా నాగశిరోమణితో కొత్తగా జిల్లా మహిళా కార్యదర్శిగా ఎన్నికైన యు. రాధమ్మ

**ఇటిక్యాల,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి కొత్త మండల కేంద్రానికి చెందిన యు. రాధమ్మను జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యదర్శిగా జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నాగశిరోమణిని నియమించినట్లు యు.రాధమ్మ తెలిపారు. మంగళ వారం శాంతినగర్‌లో ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ క్యాంపుకార్యాలయంలో మండలాల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమావేశం జోగులాంబ గద్వాల జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నాగశిరోమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చేలోక్‌సభ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు, అన్నివర్గాల వారికి అందిస్తున్న 6 గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి వెళ్లి వివరించాలని ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం ప్రతి మహిళపని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన యు. రాధమ్మను కొత్తగా జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యదర్శిగా నియమించారు.

## రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడుకి ఘన సన్మానం

**కొత్తకోట,ఫిబ్రవరి27,ప్రభాతవార్త:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడుగా నూతనంగా ఎన్నికైన డాక్టర్ ఎల్.మురళీధర్ ను,ట్రెజరర్ రావుల హేమవర్ధన్ రెడ్డి లను రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి జేఎమ్ మిషేక్ శాలువ పూలమాలతో ఘనంగా నిర్వహించారు.వనపర్తి పట్టణ వాసులు, సామాజిక సేవకులు,సమాజం పట్ల పూర్తిగా అవగాహన ఉన్న వ్యక్తి డాక్టర్ ఎల్.మురళీధర్ ఎన్నిక కావడం సంతోషంగా ఉందని మిషేక్ అన్నారు.రెడ్ క్రాస్ సొసైటీని మీ నాయకత్వంలో మరింత అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజావైద్యశాలను స్థాపించి వేలాది రోగులకు చికిత్స ద్వారా బాగుచేస్తూ వైద్య వృత్తిలో మీరు చేసే సేవలు నలుమూలల వ్యాపించాయని కొనియాడారు.ప్రమాదాల్లో చాలా మంది రక్తం టైంకు దొరకక చాలా ప్రాణాలు పోతున్నాయని అలాంటి వారికిమా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రక్త నిల్వలు ఉంచి సమయానికి రక్తాన్ని అందిస్తున్నామని తెలిపారు.అలాగే మహిళల కాన్పుకు కూడా రక్తం అవసరం పడుతుందని వారు కూడా రెడ్ క్రాస్‌ను సంప్రదిస్తున్నారని తెలిపారు.జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీలో రక్త నిల్వలు భారీగా పెరిగేందుకు మీ ఆధ్వర్యంలో యువకులకు మరింత అవగాహన కల్పించి రక్తనిల్వలపై శ్రద్ధ చూపాలని అధ్యక్షుడుని కోరారు.అనంతరం కమిటీ సభ్యులు చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## గోపన్‌పల్లి పాఠశాల అభివృద్ధికి సహకరించండి

-ఎమ్మెల్యేను కలసిన గ్రామస్థులు



**దేవరకద్ర,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గోపన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మదుసూధన్‌రెడ్డిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌హఖ్ గ్రామస్థులతో కలసి విన్నవించారు. అలాగే పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.ప్రధానంగా పాఠ శాలలో మూత్రశాలలు,ప్రహరిగోడ ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే పాఠశాల ఆవరణలో ఉన్న విధ్యుత్‌స్థంబాన్ని తొలగించాలని కోరారు.సైన్స్ ఉపా ధ్యాయుడి కొరత తీర్చడంతో పాటు పలు సమస్యలు తీర్చాలనిఎమ్మెల్యేను గ్రామస్థులు కోరారు.పలుఅంశాలపై చర్చించారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యేత్వరలో పాఠశాలలో సమస్యలు తొలగించడానికి ప్రయత్నిస్తానని హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు శ్రీకాంత్‌రెడ్డి,ఆటోపాష,కుమ్మరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



**మల్దకల్ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్‌లో ఈనెల 28 నుండి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇప్పటికే అందరి విద్యార్థులకు హాల్ టికెట్ అందజేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నరసింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28 నుండి ఇంట ర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 29 నుండి ద్వితీయ సంవత్సరం విద్యార్థులక పరీక్షలు ప్రారంభం కానున్నట్లు వీటికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు అనగావిద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ పరీక్ష రాయడానికి తరగతి గదులు అత్యవసర చికిత్స నిమిత్తం వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు పరీక్షా కేంద్రం చుట్టు పక్కల శాంతిభద్రతల పరిరక్షణకై 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులకు ప్రవేశం లేదని కావున విద్యార్థులు దీన్ని గమనించి సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మల్దకల్ పరీక్షా కేంద్రంలో మొదటి సంవత్సరం విద్యార్థులు 132 మంది రాయనున్నట్లు ద్వితీయ సంవత్సరం 67 మంది విద్యార్థులు రాయనున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికే ఇన్విజిలేటర్లకు శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆటంకం కలగకుండా పరీక్షల కేంద్రానికి సకాలంలో చేరుకుని రాయాలని కోరారు.

## ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● కూలీల సంఖ్యను పెంచాలి : ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు



గువ్వలోనిపల్లిలో మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకంలో కూలీలకు వంద రోజుల పని కల్పించాలని, ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మణ్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలని ఆయన సూచించారు. ఉపాధి కూలీల మస్టర్‌ను ఆయన పరిశీలించారు. పెనిమిళ్ల గ్రామానికి చెందిన రైతు జానయ్య వ్యవసాయ పొలంలో కంపతార చెట్లను తొలగించే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎండలు తీవ్రమవుతుండడంతో ఉపాధి కూలీలు మంచినీటి బాటిల్‌ను తమతో తీసుకువెళ్లాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో ఎంపిడిఓలక్ష్మణ్‌రావుతో పాటు ఎపిఓ సుదర్శన్‌గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్ సింగోటం, కుర్మారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు రాము,కిరణ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి



పోలియో కార్యక్రమంపై మాట్లాడుతున్న డా. విష్ణు

**ఇటిక్యాల,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గ్రామాలలో 0 నుండి5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు మార్చి 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి చిన్నారికి పోలియోచుక్కలు వేసి విజయవంతంచేయాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.విష్ణు వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల ప్రభుత్వాసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమంపై హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.విష్ణు మాట్లాడుతూ పల్స్ పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు మార్చి 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మార్చి 3వ తేదీ మొదట రోజు ఉదయం7 గం.లకే కార్యక్రమాన్ని ప్రారంభించాలని పల్స్ పోలియో బూతులలో0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని తప్పిపోయిన వారు ఉంటే 4,5తేదీలలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లిచిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. మండలంలో 0 నుండి 5 సంవత్సరాల్లోపు పిల్లలు 5052 చిన్నారులు ఉన్నారని మండలంలో 44 పల్స్ పోలియో బూతులు, 4 రూట్ కేంద్రాలుఏర్పాటు చేసినట్లు డాక్టర్ వివరించారు.మండలంలో అర్హులైన ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతంచేసేందుకు వైద్యసిబ్బందిపని చేయాలన్నారు. ఎంపిహెచ్ఈఓ శేఖర్, హెల్త్ సూపర్‌వైజర్‌లు నాగమ్మ, వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి

● సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్



కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్

**అమరచింత,ఫిబ్రవరి 27,ప్రభాత వార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం అమరచింత మున్సిపల్ ఆరు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు పనిచేయించుకోవడం ఎంత వరకు సమంజసం అని ఆయన అన్నారు.చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే కుటుంబాలు ఎలా గడుస్తాయని తక్షణమే పెండింగ్లో ఉన్న ఆరు నెలల వేతనాలతో పాటు 8 నెలల ఏరియల్ ఇవ్వాలని ఆయన మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ కార్మికులు పనిచేసే స్థలంలో మాస్కులు,చేతులకు బ్లౌజ్ వీటితో పాటు పిఎఫ్,ఐడి కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన పాలక ప్రభుత్వాలు అమలు చేయడంలో విఫలమయ్యారని ఆయన విమర్శించారు.దేశంలో వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికుల హక్కులను హరించే చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తలవగ్గిందని ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధంకావాలని ఆయనకార్మికులకు పిలుపునిచ్చారు.మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన మున్సిపల్ అధికారులను హెచ్చరించారు.మున్సిపల్ కార్మికులకు మద్దతుగా తెలంగాణ రైతుసంఘం జిల్లా కోశాధికారి,బి వెంకటేష్,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం,జిల్లా ఉపాధ్యక్షులు అజయ్,సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి,ఆర్ ఎన్ రమేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి,మోష మద్దతుగా మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు మహంకాళి ప్రభాకర్,సిఐటియు జిల్లా అధ్యక్షులు, బుచ్చన్న, ప్రేమ్ కుమార్,హరికృష్ణ, శ్యాంసుందర్,భాస్కర్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## చెరుకు రైతులకు టన్నుకు రూ.5600 నిర్ణయించాలి



ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరిగిన రైతుల సమావేశంలో పాల్గొన్న ముఖ్య నేతలు

**ఆత్మకూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చెరుకు రైతులకు టన్నుకు రూ.5600 నిర్ణయించాలని చెరుకు రైతులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో జరిగిన చెరుకు రైతుల సమావేశానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కె.రాజన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకు కోతలకు సరిపడా లేబర్ పంటాలను తెప్పించి నిర్ణయించిన ధరలకే కోతలను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు ఇవ్వాల్సిన చెరుకు డబ్బులు వెంటనే 30 రోజుల్లోగా రైతుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని ఆగిపోయినటువంటి డ్రిప్పు సబ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతులకు మద్దతు ధర నిర్ణయించామని గొప్పలు చెప్పుకుంటుంది కానీ ఆచరణలో మాత్రం రైతులకు శూన్య హస్తం చూపిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ స్వామినాథన్‌కమిషన్‌కు నోబెల్ బహుమతి ఇచ్చారు. కానీ స్వామినాథన్ కమిషన్‌కు నోబెల్ బహుమతి ఇచ్చారు. కానీ స్వామినాథన్ సూచించిన సిఫార్సులను ఏమాత్రం అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోని కృష్ణవేణి చెరకు రైతు సంఘం ఆధ్వర్యంలో మహారాష్ట్ర నుంచి లేబర్ బంటాలను తెప్పించి చెరుకు కోతలు ప్రారంభించాలని లేనిపక్షంలో చెరుకు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా ఫిబ్రవరి నెల 13వ తేదీ నుండి రైతులు చేపట్టినటువంటి ఢిల్లీ చలో కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకు రైతు సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు, సిహెచ్ రామచందర్ రంగారెడ్డి సంజీవరెడ్డి, రాజు, రవి, అరుణ్‌కుమార్, తిరుపతయ్య, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాలి

తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్



**ఉప్పునుంతల,ఫిబ్రవరి27 ప్రభాతవార్త:** స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా ఇచ్చే పదోన్నతి షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని, తపస్ మల్టీజోన్ 2లో స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ఇచ్చే పదోన్నతులకు కోర్టు కేసు కారణంగా ఆగిపోవడం జరిగిందని సోమవారం హైకోర్టు ఈ కేసును ఎత్తివేసిన కారణంగా త్వరగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులకు షెడ్యూల్‌ను ప్రకటించి పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఉప్పునుంతల మండల తపస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ 8 సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించలేదని ఉద్యోగుల పదవి విరమణ వయసు 61సంవత్సరాలకు పెంచిన కారణంగా గత మూడు సంవత్సరాల నుంచి పదవి విరమణ కాలేదని వచ్చేనెల నుండి ఉద్యోగులకు పదవి విరమణ ప్రారంభమవుతున్నదని ఆయన పేర్కొన్నారు. పదోన్న తులకు అర్హులైన చాలా మంది ఉపాధ్యాయులు ఎంతో ఆశగా తాము పదోన్నతి పొంది ఉద్యోగ విరమణ చెందాలని ఎదురుచూస్తున్నారని ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకుని పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగర శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి జగదీశ్వర్, మండల గౌరవ అధ్యక్షులు నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కట్టమల్లారెడ్డి, మండల అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రాజేష్, సభ్యులు చంద్రశేఖర్, అశోక్, మహేష్ పాల్గొన్నారు.

## మాలధారణలో పాటించిన నియమాలు నిత్యం కొనసాగించాలి

■ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న శివస్వాములు

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి27 ప్రభాతవార్త:** పట్టణంలో అతి పురాతనమైన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో మంగళవారం శివస్వాములు 24వ శివ మహామెట్ల పూజ శివనామస్మరణతో అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, లలిత దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారణలో పాటించిన నియమాలు నిత్య జీవితంలో పాటించడం వల్ల ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతుందని ఎమ్మెల్యే అన్నారు.అనంతరంవారికి గురు స్వామి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. అంతకు ముందు పురాతనమైన పడమటి ఆంజనేయస్వామి దేవాలయం నుండి పట్టణ పురవీధుల గుండా శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయం వరకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో శివపార్వతుల కటౌట్‌తో కలశ ఊరేగింపును శివస్వాములు నిర్వహించారు. దారి పొడవునా కలశధార శివస్వామికి భక్తులు మహిళలు నిండు బిందెలతో నీళ్ల పారబోసి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఆలయం వద్ద జరిగిన మహాపూజ వేడుకల్లో శివుడికి అభిషేకం,బిల్వార్చన, విశేష పూజాకార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ముఖ్య వక్తగా ఉడిపి పెజవర మఠం తెలంగాణ, ఆంధ్ర ధర్మ ప్రచారక్‌విద్వాన్ రాఘవేంద్ర ఆచార్య మాట్లాడుతూ శివమాల ధారణలో భగవంతుడి నామస్మరణ ప్రతిరోజు చేయాలని సూచించారు. శివదీక్షా పరుల సంకల్పంతో త్వరలో కాశీ విశ్వనాథుడి ఆలయ పునర్నిర్మాణం కూడా పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాలా ధారణలో ఉన్న నియమనిష్టలు జీవితంలో ఆచరించడంవల్లఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతుందన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన శివ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.



## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : సిఐ



**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి27 ప్రభాతవార్త:** జాతీయ లోక్ అదా లత్ మార్చి9వ తేదీ వరకు ఉన్నందున మక్తల్ సర్కిల్ పరిధిలోని బాధి తులు రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులతో పాటు, భూ తగాదా, చిట్‌ఫండ్, రోడ్డు ప్రమాద, వివాహ, కుటుంబ తగాదాలతో పాటు ట్రాఫిక్ కేసులకు సంబంధించి డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ కేసులు, వివిధ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని మక్తల్ సిఐ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయ, రాజీ మార్గమే రాజమార్గమని సిఐ పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో సామరస్య ధోరణితో రాజీ పడదగిన వివిధ కేసులపై న్యాయస్థానాల చుట్టు తిరగ కుండా కేసులు పరిష్కారం చేసుకోవాలని సిఐ సూచించారు. క్షణికా వేశంలో భార్యాభర్తల మధ్య అన్నదమ్ముల మధ్యజరిగిన వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించు కోవాలని, అలాగే ఒకే గ్రామంలో నివాసం ఉండేవారు కేసులతో గొడవలు పెంచుకోవద్దని రాజీమార్గ ద్వారా సఖ్యతగా ఉండాలని, జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సిఐ కోరారు.

## రోడ్లకు ఇరువైపులా కంపచెట్ల తొలగింపు



రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు తొలగిస్తున్న దృశ్యం

**బిజినేపల్లి,ఫిబ్రవరి27 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదిన వేడుకలను దృష్టిలో పెట్టుకొని గుడ్లనర్వ గ్రామం నుండి కుమ్మెర జాతర జరిగే స్థలం వరకు కంపచెట్లు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోర్‌రెడ్డి ఆదేశాల మేరకు కంపచెట్ల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ నాయ కులు తెలిపారు. జిల్లాలోనే అత్యంత వైభవంగా నిర్వహించే శివరాత్రి వేడుకల సందర్భంగా జాతర కార్యక్రమానికి విచ్చేసే భక్త జనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా కంపచెట్లు తొలగింపు చేపట్టినట్లు తెలిపారు.కంపచెట్ల తొలగింపుతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలరాజు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మిద్దె మల్లేష్, మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఖలీల్, ఓబిసి సెల్ జనరల్ సెక్రెటరీ కల్లు శ్రీనువాస్‌గౌడ్, కాంగ్రెస్‌కార్యకర్తలు,ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేలకుప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎస్సీ కులాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోండి

● ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారిని సరోజ

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** హైదరాబాదులోని రామంతాపూర్, బేగంపేట్ పబ్లిక్ పాఠశాలల్లో ప్రవేశాలకు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ జోగులాంబ గద్వాల్ జిల్లా ఇంచార్జి అధికారిని సరోజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024.25 విద్యా సంవత్సరానికి గాను ఒకటవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. చిన్నారులు 01.06.2017 నుంచి 31.05.2018 లోపు జన్మించి ఉండాలన్నారు. పుట్టిన తేది ధ్రువీకరణ పత్రాన్ని తహసీల్దార్, మున్సిపల్ కార్యఆలయం, మీసేవ ద్వారా పొంది ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణాల్లో అయితే రూ. రెండు లక్షల లోపు,గ్రామాల్లో అయితే రూ.లక్షా50 వేలలోపుఉండాలని సూచించారు. దరఖాస్తు ఫారానికి మీసేవ ద్వారా పొందిన కుల,ఆదాయ,స్థానిక ధ్రువీకరణ పత్రాలతోపాటు,ఆధార్‌కార్డు రేషన్‌కార్డు,జిరాక్స్‌లను జత చేయాలన్నారు. దరఖాస్తులను ఫిబ్రవరి 24 నుండి మార్చి 12వ తేది లోపు జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని ఐడిఓసి రూమ్ నెంబర్ ఎఫ్8 లో తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇతర వివరముల కొరకు 8309540738నెంబర్‌ను సంప్రదించగలరు. లక్కీ డీప్‌ద్వారాతేది. 15.03.2024నాడువిద్యార్థులఎంపికజరుగుతుందనిఆమె పేర్కొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ మల్యాలు బాలస్వామికి అతిథి జాతీయ తెలుగు మాసపత్రిక ఎక్సలెన్సీ అవార్డు



శాసనసభ స్పీకర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మల్యాల బాలస్వామి

**వనపర్తి టౌన్ ఫిబ్రవరి27 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రానికి చెందిన అతిథి జాతీయ తెలుగు మాసపత్రిక ఎక్సలెన్సీఅవార్డు 2024 కు, ఎంపిక చేశారు. రాజకీయ,సామాజిక, సాంస్కృతిక, విద్యా మాసపత్రిక ఎడిటర్ ఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రొఫెసర్లు, వివిధ ప్రముఖులు, జర్న లిస్టులకుఉన్నత విద్యాసంస్థల అవార్డులను, సోమవారం రాత్రి హైదరాబాదులోని రవీంద్ర భారతి మెయిన్ ఆడిటోరియంలో అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, వికాస్ ఫార్మసీ కళాశాల, చైర్మన్ రాందాస్‌ల చేతులమీదుగా బాలస్వామిఈ అవార్డునుస్వీకరించారు. సీనియర్ జర్నలిస్టు, విభాగంలో అతిథి జాతీయ తెలుగు మాసపత్రిక,ఎక్సలెన్సీ అవార్డు 2024 అందుకోవడం జరిగిందని బాలస్వామి తెలిపారు.

## వేసవిలో మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలి



**పాన్‌గల్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** గ్రామపంచాయతీలోని నర్సరీలో ఏర్పాటు చేసిన మొక్కలను వేసవిలో ఎండిపోకుండా సంరక్షించాలని ఎంపీడీవో కోటేశ్వర్ అన్నారు.మంగళవారం మండల పరిధిలోని అన్నారం తండా వెంగలాయిపల్లి గ్రామాల్లోని నర్సరీలోని మొక్కలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలకు ప్రతిరోజు నీరు పంపించేస్తూ షిఫ్టింగ్ చేసి మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని సూచించారు.అదేవిధంగా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు.పనుల వద్ద కూలీలకు తాగునీటి వసతి టెంట్లు వసతులుకల్పించాలనిసూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో కురుమయ్య పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్ నాగిరెడ్డి ఉన్నారు.

## ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం

**పాన్‌గల్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన రైతు గుణగంటి రాములు కు చెందిన గడ్డివాము మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైనట్లు బాధిత రైతు గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు బాధిత రైతు తన పశువుల మేత కోసం రెండు ఎకరాల పశుగ్రాసం ఈదమ్మ గుడి సమీపంలోని వ్యవసాయ పొలంలో నిలువ చేసుకోగా ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు.ప్రభుత్వం బాధిత రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.



## ఎస్‌జిటియు ఇటిక్యాల మండల కార్యవర్గం ఏర్పాటు

**ఇటిక్యాల ఫిబ్రవరి27 ప్రభాతవార్త:** ఎస్‌జిటియు ఇటిక్యాల మండల నూతన కార్యవర్గ ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం ఎర్రవల్లిలోని స్థానిక ప్రాథమిక పాఠశాల ఎర్రవల్లిలో ఎస్‌జిటియు ఇటిక్యాల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటిక్యాల మండల ఎస్‌జిటి ఎల్ఎఫ్ ఎల్ హెచ్‌యంలు పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలు, ప్రాథమిక పాఠశాలలో విద్య పటిష్టం కొరకై వివిధ సమస్యల పరిష్కారాలపై చర్చించుకున్నారు. అనంతరం ఇటిక్యాల మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎస్‌జిటియు ఇటిక్యాల మండల గౌరవ అధ్యక్షునిగా హెచ్ఎంరత్నయ్య,ఎస్‌జిటియు ఇటిక్యాల మండల అధ్యక్షులుగా శ్రీరాముడు ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షులుగా రాముడు, మహిళా ఉపాధ్యక్షురాలిగా జయమ్మ, మండల కార్యదర్శిగా చిన్నస్వాములు, ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి గా వినోద్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా హుస్సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జోగులాంబ ఎస్‌జిటియు అధ్యక్షులువెంకటయ్య, ప్రధాన కార్యదర్శి సోము సుందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంతయ్య, రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌రెడినడ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి, గోపాల్, ఇటిక్యాల మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**రేవల్లి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మండలంలోని తలుపునూరు గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవ్యశ్రీ డీఈఓగా అకిరా నందన్ ఎంఈఓగా నాగరాజు కలెక్టర్‌గా హేమంత్ కొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ విద్యా బోధన చేసిన శ్రీ వానిక లింగమ్మ చందన వినోద్ మహేశ్, ఉమా ఫెరోజ్ ఉత్తమ పిటిగా కురుమూర్తి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐష, జబీన్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లలు బరువు తగ్గకుండా చూసుకునే బాధ్యత అంగన్వాడి సెంటర్లదే..



**వీపనగండ్ల,ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** అంగన్వాడి సెంటర్లో చదువుతున్న చిన్నారుల్లో తక్కువ బరువులు ఉన్న వారిని గుర్తించి వారి పట్ల తీసుకో వలసిన జాగ్రత్తలను గురించి మండల వైద్యాధికారి వంశీకృష్ణ అంగన్వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు.మంగళవారం నాడు ఆయన అంగన్వాడి సెంటర్లలోని చిన్నపిల్లల కు వైద్యం నిర్వహించి అంగన్వాడి ఉపాధ్యాయులకు ఆయాలకు తగు సూచనలు చేయడం జరిగింది. పిల్లలు ఆరోగ్యంగా పెరగాలంటే ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తగు పద్దతిలో వారికి అందించినప్పుడే వారు ఆరోగ్యంగా పెరుగుతారని ఆయన ఈ సందర్బంగా తెలిపారు.బరువు తక్కువగా ఉండిబలహీనంగా ఉన్న వారిని గుర్తించి వారికి అధిక పౌష్టికాహారాన్ని అందివ్వాలని బరువు పెరిగేందుకు అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని ఆయన అన్నారు.

## మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ బీసీలకు కేటాయించాలి

**- బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఫిబ్రవరి27, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థులుగా బీసీలకే టికెట్ కేటాయించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రాజకీయ పార్టీలన్ని అగ్రవర్ణ వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని, బీఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీలు కూడా బీసీ అభ్యర్థులకే సీటు కేటాయించాలని కోరారు. బీజేపీ నుంచి బండారి శాంతికుమార్‌కే టికెట్ ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికి వినతిప్రతం ఇవ్వనున్నట్లు తెలిపారు. 60నుంచి 65 శాతం ఉన్న బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జాంఢ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, సవారి సత్యం,ఆర్ సత్యం పాల్గొన్నారు.

## జోగులాంబ సన్నిధిలో జిల్లా ఎస్పీ

**అలంపూర్ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** అలంపూర్ దక్షిణకాశీ బాల బ్రహ్మేశ్వర స్వామి ఐదవశక్తి పీఠమైన జోగులాంబ ఆలయాలను మంగళవారం జిల్లా ఎస్పీరితిరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అర్చకులు ఈఓ పురేంద్ర కుమార్, చైర్మన్ చిన్ని కృష్ణయ్య నాయుడు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా జోగులాంబ అమ్మవారి ని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఎస్పిని శేషవస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

## సహాయక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

**ఉప్పునుంతల,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని సహాయక పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసిల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. మండలంలోని 12 సహాయక కేంద్రాలను గుర్తించినట్లు ఆయన చెప్పారు. పాఠశాలలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల వసతులను పరిశీలించారు. సహాయక పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతుల ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంలో మండల గిర్దావర్ రాజేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆధారాలు చూయించి బ్యాగు తీసుకెళ్లండి: సిఐ

**జడ్చర్ల,ఫిబ్రవరి 27ప్రభాతవార్త:** సోమవారం ఉదయం సుమారుగా ఎనిమిది గంటల సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు జడ్చర్ల నుంచి కల్వకుర్తి మార్గంలో వెళ్తుండగా గంగాపురం సమీపంలో బ్యాగును పోగొట్టుకున్నారు. బ్యాగును ఓ వ్యక్తి జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సదరు వ్యక్తిని జడ్చర్ల సిఐ ఆదిరెడ్డి అభినందించారు. కావున ఈ బ్యాగుకు సంబంధించిన వ్యక్తులు తమ ఆధారాలతో జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చి తీసుకు వెళ్లాలని సిఐ సూచించారు.

## ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని కలిసిన బండ్ల చంద్రశేఖర్ రెడ్డి



**గద్వాల్ ప్రతినిధి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా నియమితులైన జిల్లెల చిన్నారెడ్డిని గద్వాల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం కలిశారు. మంగళవారం హైదరాబాదులో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా నియమితులైన జి.చిన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా,ధరూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భాజపాతోనే అభివృద్ధి సాధ్యం

**● బిజెపి కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి**



మాట్లాడుతున్న బిజెపి కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి

**లింగాల,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** దేశంలో, రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే అది భాజపాతోనే సాధ్యమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి నిర్వహించిన విజయ సంకల్పయాత్ర మంగళవారం అంబ టిపల్లి గ్రామం మీదుగా లింగాల చేరుకుంది. ఈ సందర్బంగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి బిజెపి అధికారంలోకి రావడంతో పాటు, నరేంద్రమోడీనే మళ్లీ ప్రధాని అవుతారని అన్నారు. 367 ఆర్టికల్ రద్దుచేసి ట్రిపుల్ తలాక్ అయోధ్య రామమందిరం నిర్మాణం వంటి అంశాలతో పాటు శత్రు దేశాల నుంచి భారత్‌ను కాపాడడంలో మోదీ కృషి చాలా గొప్పదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలో కేంద్రం వాటా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా సిసి రోడ్లు, మరుగుదొడ్లు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులే అని పేర్కొన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారని ఎన్నికలు ముగిసి 90 రోజులు దాటిపోయిన అవేమి అమలు కాలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్‌ను, పార్టీలను ఓడించాలని కోరారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపివిజయం సాధిస్తుందని ధీమావ్యక్తం చేశారు.ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్, జిల్లా బిజెపి అధ్యక్షులు సుధాకర్‌రావు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, సంకల్ప యాత్ర ప్రముఖ శ్రీవర్ధన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, సోలాంకి శ్రీనివాసులు, అచ్చంపేట అసెంబ్లీ కన్వీనర్ రేణయ్య, బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామోజీ, అచ్చంపేట ప్రభారి జగదీష్‌రెడ్డి, లింగాల మండల శాఖ అధ్యక్షులు యాదగిరి సలేశ్వరం, బిజెవైఎం మండల అధ్యక్షులు కోళ్ళ శ్రీనివాసులు, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారులే సూత్రధారులు?

**● ఒక్క డీడీతో 10 ట్రిప్పల వరకు అక్రమంగా తరలింపు**

**● వట్టిపోయిన కల్లివాగు..**

**● ఖిల్లాలో జోరుగా ఇసుక అక్రమ రవాణా**



మండల కేంద్రం నుండి వెళుతున్న అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్

**ఖిల్లా ఘణపురం,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. సీసీరోడ్ల అనుమతితోఅడ్డు అదుపు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు అధికార పార్టీకి తలొగ్గి సహకరిస్తున్నట్లు తెలుస్తున్నది. వివరాల్లోకి వెళితే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి మూడు కోట్లకు పైగా సిసి రోడ్లు మంజూరయ్యాయి. దీంతో సమీపంలో ఉన్న మలికినియన్ పల్లి గ్రామ పిల్లి వాగు శివారు నుండి రెవెన్యూ అధికారులు ఇసుక రవాణాకు అనుమతించారు. సీసీరోడ్ల పేరుతో ఒక ట్రిప్పుకు రూ.1150 డీడీ చెల్లిస్తూ ఒక్కో ట్రాక్టరురోజుకు 10ట్రిప్పుల వరకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఆయా గ్రామాలలో అధికార పార్టీకి చెందిన నాయకులు ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.3000నుంచి3500 వరకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు రెండు రోజులపాటు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు రెవెన్యూ అధికారులపై పైఅధికారుల నుండి ఒత్తిడి తీసుకువచ్చి తిరిగి అక్రమ ఇసుక రవాణాకు తెరలేపారు. రోజుకు కిల్లివాగులో 10 జేసీబీలు నాలుగు హిటాచీలతో వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తూ పర్యావరణానికి విఘాతం కల్పిస్తున్నారు. గత 20 రోజులుగా పిల్లి వాగు నుండిఅక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో వాగుపూర్తిగా వట్టి పోయింది. గత ఏడాది నుండి మండలంలోని పలువురు ఇండ్ల నిర్మాణం చేస్తున్న నిరుపేదలు ఇసుక కొరకు ఆన్లైన్‌లో డబ్బులు చెల్లించిన ఇంతవరకు ఇసుక రాలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా తరలిపంపుపై పలువురుఫిర్యాదులు చేస్తున్న అధికారులుచూసి చూడనట్లు ఉండాలని పై నుండి ఆదేశాలు రావడంతో రెవెన్యూ పోలీస్ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. వాగులు మట్టి పోయి బోర్లు ఎండిపోక ముందేఅధికారులు స్పందించి వెంటనే అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని అక్రమ ఇసుక రవాణా విషయంలో కలెక్టర్ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# జిల్లా కేంద్రంలో కలవరపెడుతున్న క్షుద్ర పూజలు

**- సీసీ పుటేజ్ ఆధారంగా నిందితుడు గుర్తింపు..**



షాపు వద్ద వదిలి వెళ్లిన అక్షిత సామాగ్రి, సీసీ పుటేజ్ ఆధారంగా క్షుద్ర పూజలకు పాల్పడినట్లు సీసీ పుటేజీలో గుర్తించిన వ్యక్తి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఇటీవలే క్షుద్ర పూజలతో అమాయకులను మట్టు పెట్టిన ఘటన మరువక ముందే మళ్లీ క్షుద్ర పూజ సంఘటన జిల్లా కేంద్రంలో కలవరపెడుతోంది. అత్యాధునిక టెక్నాలజీ సమాజంలో కూడా క్షుద్ర పూజలు నేపథ్యంతో చాలా మంది ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. ఆదివారం మధ్య రాత్రి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ షాపు ప్రక్కన గల కేజీఎన్ పూల దుకాణం వద్ద క్షుద్ర పూజలు చేసినటువంటి సామాగ్రిని వదిలి వెళ్లారు. షాపు యజమాని తన దుకాణం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో పరిశీలించి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు అక్కడికి చేరుకొని అక్షిత పూజ చేసిన సామాగ్రిని స్వాధీనం చేసుకొని, సీసీ పుటేజ్ ఆధారంగా లింగాలకు చెందిన వ్యక్తిగా గుర్తించి పట్టుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పూల దుకాణంతో పాటు మరో రెండు ఇండ్ల వద్ద కూడా క్షుద్ర పూజలు చేసిన సామాగ్రిని దొరికినట్లు సమాచారం. వాళ్లందరు ఒకే పార్టీకి చెందినవారు కావడం గమనార్హం. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

# రైతులకు మామిడి పంటపై అవగాహన సదస్సు

**భూమిలో భూసారాన్ని పెంచితేనే చీడపీడల నుండి పంటలను రైతులు రక్షించుకోగలరు : కెవికె శాస్త్రవేత్త శంకర్**



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త

**వీపనగండ్ల ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** రైతులు భూమిలోని భూసారాన్ని పెంచితేనే పంటలను చీడపురుగుల నుండి రక్షించుకోవడం జరుగుతుందని కెవికె శాస్త్రవేత్త పాలెం శంకర్ తెలిపారు. మంగళవారం నాడు వీపనగండ్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల రైతులకు మామిడి పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీన్ని కోరమండల్ ఫర్టిలైజర్ కంపెనీ వారు ఆధ్వర్యంలో నిర్వహించారు. దానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు కోరమండల్ కంపెనీ జోనల్ మేనేజర్ ఎం.గోవిందారావ్ రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులుగా నానోడిఏపి గురించి ప్రథమ, ద్వితీయ , సూక్ష్మ పోషకాలు ప్రాధాన్యం గురించి వివరించారు. సబ్జెక్టు మ్యాటర్ స్పెషలిస్టు హర్టికల్చర్ కెవికె పాలెం శంకర్ ప్రస్తుతం మామిడి పంటలో రైతులు ఎదుర్కుంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని సంబంధించి మందులను మామిడి పంటలపై తీసుకోవలసిన జాగ్రత్తాలను సూచించారు. తర్వాత మండల ఉద్యాన శాఖ అధికారి కృష్ణ సస్యరక్షణ పోషక యాజమాన్య పద్దతులు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో హర్టికల్చర్ హెచ్ఓ కృష్ణ ఆ కంపెనీసీనియర్ అగ్రానమిస్టు ఎంఆర్‌టి శ్రీధర్‌రెడ్డి, రైతులకి మట్టి పరీక్షల ప్రాముఖ్యతను పరీక్షలను చేయించుకునే విధానాన్నితెలిపారు. వీపనగండ్ల వ్యవసాయ అధికారిని రజిత, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ సేవల గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ మార్కెటింగ్ఆఫీసర్లు రవికుమార్, ప్రవీణ్‌కుమార్,అగ్రానమిస్టు శివ పాల్గొన్నారు.

# వంశీచంద్‌రెడ్డి దూకుడు..!



**మొదటి పేజీ తరువాయి భాగం..** మహబూబ్‌నగర్, దేవరకద్ర, నారాయణపేట,మక్తల్, కొడంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థులే సత్తా చాటి పార్లమెంట్ సెగ్మెంట్ మొత్తం క్లీన్ స్వీప్ చేశారు. దీంతో మహబూబ్‌నగర్‌లో చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపునకు దోహదపడనున్నారు. వంశీచంద్‌రెడ్డి కూడా మొదటి నుంచి అందరి ఎమ్మెల్యేలతో సత్సంబంధాలు ఉండడం, అందరి సమిష్టిగా ముందుకు సాగడం వంశీకి కలిసి వచ్చే అవకాశం ఉన్నది. ఇటీవల టీటీడీ మాసీఎం ఫోకస్‌ఉమ్మడి పాలమూరులోని రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. గతంలో అసెంబ్లీ ఎన్నికలముందు ఉమ్మడి పాలమూరు జిల్లాను క్లీన్ స్వీప్ చేయాలని పలు మార్లు చెబుతూ వచ్చారు.దీంతో 14 స్థానాలకు 12స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచి ఉమ్మడి పాలమూరులో కాంగ్రెస్ కంచుకోటగా నిలిపారు. పాలమూరు బిడ్డ సీఎంగా ఉండడం ఈ ప్రాంతానికి ఎంతో గౌరవమని, రెండు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి గౌరవ నిలబెట్టాలని చెబుతూ వస్తున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని50వేల మెజార్టీ తగ్గకుండాకొగంగల్ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోస్గి సభలో సీఎం కోరారు. దీంతో పాటు వంశీని గెలిపించి కొడంగల్ ప్రాంతం నుంచి 50వేలకు పైగా మెజార్టీ ఇస్తే కొడంగల్ ప్రాంతానికి మరో 5వేల కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందడం,సీఎం సొంత ఇలాఖా కావడం, వంశీచంద్‌రెడ్డికి అందరితో సత్సంబంధాలుఉండడంమహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు దోహదపడనున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## మరో మేడారంగా జమ్మిచెడ్ జాతర

**గద్వాల ప్రతినిధి,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలో శ్రీశ్రీశ్రీస్వయంభుగా వెలసిన జములమ్మ దేవతకు మంగళవారం లక్షలాది మంది భక్తులు వచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణలో సమ్మక్క సారక్క జాతరలాగే జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల పట్టణంలోజములమ్మ జాతరకు కూడ భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జాతర బ్రహ్మాండంగా జరుగుతుంది. ఈ దేవతకు కర్ణాటక,మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వివిధ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దేవతకు పూజలు నిర్వహిస్తున్నారు. కోరిన కోరికలు తీర్చే మా అమ్మ జమ్మలమ్మతల్లి అని భక్తులు మొక్కుబడులు చెల్లించుకొంటున్నారు. నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి గద్వాల జమ్ములమ్మ దేవత, ఎండోమెంట్ అధికారులు భక్తులకున్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి తాగునీరు, వైద్యవసతి,భక్తులు ఉండడానికి చలవ పందిళ్లు వేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, దేవాదాయ శాఖ అధికారి పురేందర్ కుమార్ తెలియజేశారు.



# కెమిస్ట్రీ పాత్ర అమోఘం

**● మానవాళి సుస్థిర అభివృద్ధిలో కీలకం**

**● పియు జాతీయ సదస్సులో ప్రొ॥ రిజిస్ట్రార్ లక్ష్మీకాంత్ రాథోడ్**




సావరిన్ ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి27 ప్రభాతవార్త:** మానవ సుస్థిర అభివృద్ధిలో కెమిస్ట్రి పాత్ర ముఖ్యమైనదని, యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ నెలకొల్పుతున్నామని, విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవర్చుకుంటే సబ్జెక్టు నేర్చుకుంటారని, అప్పుడే కొత్త ఆవిష్కరణలు చేయడానికి అవకాశం ఉంటుందని పాలమూరు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ॥ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీలో లైబ్రరీ ఆడిటోరియంలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు కెమిస్ట్రీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అనే అంశంపై నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పీయూ విసి హాజరై మాట్లాడారు.ఫలితంగా మానవాళి జీవితం సంతోషంగా ఉంటుందని, అధ్యాపకులకు సీడ్ ఇస్తున్నామని, దాంతో యూనివర్సిటీలో రీసెర్చ్ ప్రతి ఒక్కరూ చేస్తున్నారని అన్నారు. కీ నోట్ స్పీకర్ ఐఐసిటి, డైరెక్టర్ డా. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నోఫెలోషిప్‌లు ఇస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. దేశంలో 37 రీసెర్చ్ సెంటర్లు ఉన్నాయని, ముఖ్యంగా స్త్రీలు పరిశోధనలపై మక్కువ చూపడం లేదని, ఆ దిశగా అందరూ ఆలోచించాలని అన్నారు. నేచర్ గొప్ప శాస్త్రవేత్త అని, మందులు 80శాతం నుంచి ప్రకృతి నుంచి పొందుతున్నామని, వెహికల్స్, ఎలక్ట్రానిక్స్,గృహ నిర్మాణం రంగంలో కెమిస్ట్రి ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. కెమిస్ట్రీ అన్ని సబ్జెక్టులకు అనుసంధానంగా ఉంటుందని, మానవాళికి తీవ్ర ముప్పుదోమల వల్లఉంటుందని, వాటి నివారణ కోసం పరిశోధనలు కొనసాగుతున్నాయని,ఐఐసిటిలలో పిహెచ్‌సి చేయడానికి సెట్/నెట్/జెఆర్ఎఫ్‌లో అర్హతలతో పాటు ఆసక్తి ఉండాలని అప్పుడు మాత్రమే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని అన్నారు. కన్వీనర్ డా. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు 100కు పైగా అబ్‌స్ట్రాక్ట్స్ వచ్చాయని, 200 మెంబర్స్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అన్నారు. అనంతరం రిజిస్ట్రార్‌తో పాటు ప్రొఫెసర్లు కలిసి సావరిన్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఇంచార్జి రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ డా. చంద్రకిరణ్, ఈసి మెంబర్ డా.నూర్జహాన్,కన్వీనర్ డా.కె.శ్రీధర్‌రెడ్డి, ప్రొ॥ మనోహర్, డా.నాగయ్య,రాజేందర్‌రెడ్డి,కోకన్వీనర్స్ కె.రామ్మోహన్,ఎస్. అయేషా హష్మీ, డా.ఎస్.రవికుమార్, బి.సిద్ధరామగౌడ్, డా.రూపారాణి, డా.పి. రామరాజు, బేబీలత, డా.దీప్తిరెడ్డి, స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్మ కడుపుకు కోతే..!

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అవుతుంది. అయామక ప్రజలు, గ్రామీణ ప్రాంత ప్రజలనే టార్గెట్‌గా చేసుకుని ఈ దందాను మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా కొనసాగిస్తున్నారన్న విమర్శలు చాలానే ఉన్నాయి.

**సహజ కాన్పుల పెంచేలా వైద్యాధికారుల సమావేశాలు చర్యలు ఫలించేనా...**

ప్రైవేట్ ఆసుపత్రిలో సహజ కాన్పులు పెంచేలా ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రైవేట్ ఆసుపత్రుల యజమానులు, వైద్యులతో సమావేశాన్ని నిర్వహించారు. సహజ కాన్పులు అయ్యేందుకు గర్భం దాల్చిన మహిళలు తీసుకునే జాగ్రత్తలు, చేయవలసిన యోగా ఆరోగ్య వంటి చిట్కాలు, సలహాలను ఇవ్వాలని సమావేశాన్ని పెట్టి సూచించడం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నం ఫలిస్తుందో లేదో వేచి చూడాల్సి వస్తుంది.

**ప్రైవేట్ ఆసుపత్రిలో సహజ కాన్పులు జరిగేలా చర్యలను తీసుకుంటాం..**



ప్రైవేట్ ఆసుపత్రిలో సహజ కాన్పులు జరిగేలా చర్యల ను తీసుకుంటున్నాం.అందులో భాగంగానే ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం, వైద్యులతో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఆసుపత్రికి గర్భం దాల్చిన వచ్చిన మహిళలు తీసుకునే జాగ్రత్తలు, చేయ వలసిన యోగా ఆరోగ్య వంటి చిట్కాలు, సలహాలను ఇవ్వాలని సూచిం చడం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సహజ కాన్పులు ఎక్కువగా జరుగుతున్నాయి అత్యవసరమైతేనే తప్ప సిజిరియన్లకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు.

-జైచంద్రమోహన్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, వనపర్తి

## కోర్టు భవన నిర్మాణానికి పూర్తి సహకారం

**-హైకోర్టు న్యాయమూర్తి విజయసేనరెడ్డి**



హైకోర్టు న్యాయమూర్తితో కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వకుర్తి కోర్టు భవనం శిథిలావస్థకు చేరిందని కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు హైకోర్టు న్యాయమూర్తి విజయసేనరెడ్డిని కలిసి కోర్టు భవన పరిస్థితిని వివరించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి విజయసేన రెడ్డి మాట్లాడుతూ ఈ మధ్యనే జిల్లా నుంచి నూతన కోర్టు భవన నిర్మాణం విషయమై ప్రతిపాదన రావడం జరిగిందని పరిశీలించి అతి త్వరలో నూతన కోర్టు నిర్మాణ అనుమతి ఇవ్వడం జరుగుతుందని న్యాయవాదులకు హామీ ఇచ్చారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి మాధవి దేవీ జస్టిస్ దింపాగ నగేష్ తదితరులను కల్వకుర్తి బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలిశారు.హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు హన్మంత్‌రెడ్డి, భుజంగరావులు న్యాయవాదుల వెంట ఉండి న్యాయమూర్తికి కోర్టుసమస్యలు వివరించారు.కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు లక్ష్మణశర్మ,వెంకట్‌గౌడ్,వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, మల్లేపల్లి జగన్, వెంకటేష్,నాగరాజు,లక్ష్మణ్‌రాజ్,జయంతికుమార్,రాంగోపాల్, ప్రశాంత్, సత్యం, శ్రీను, రాజు తదితరులు న్యాయవాదులు ఉన్నారు.

## మహబూబ్‌నగర్‌లో 2కె రన్

**ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా నిర్వహణ**

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** రిజర్వ్ బ్యాంకు ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26 నుండి మార్చి 1 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 2కె వాక్ నిర్వహించారు. ఈ 2కె వాక్ కలెక్టర్ బంగ్లా దగ్గర ఉన్న ఎస్.సి, డిగ్రీ, ఇంటర్మీడియట్ హాస్టల్ నుండి ప్రారంభమై, ఎస్సీ హాస్టల్ నుండి కోర్టు కాంప్లెక్స్, తెలంగాణ చౌరస్తా, నవోదయ ఆసుపత్రి, ఓల్డ్ బస్టాండ్, పోలీస్ హెడ్ క్వార్టర్స్ మీదుగా తిరిగి ఎస్సీ హాస్టల్ వరకు కొనసాగింది.కార్యక్రమంలో స్టేట్‌బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జి. శ్రీనివాస్, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్,సాంఘిక సంక్షేమశాఖ డిడిపాండు,ఎల్‌డిఎం భాస్కర్, జిల్లా అధికారులు, బ్యాంక్ కంట్రోలర్‌లు, కో ఆర్డినేటర్‌లు, 300ల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

